# నిగ్రహం

"చలం"

> మతం తాగి మతాన్ని పీల్చే యీదేశంలో అది ఎముకల్లో, నరాల్లో ప్రవేశించి పౌరుషాన్ని, అభివృద్ధిని, ఆనందాన్నీ నాశనం చేసింది. అదేమిటంటే సుఖమనుభవించడము పాతకమని......అశాశ్వతం...... ముక్తికి భక్తికి విరోధం అని అంటారు... అశాశ్వతం గనకనే యవ్వనము, జీవనమూ వున్నప్పుడే సుఖాల్ని అనుభవించాలి.

పుట్టినప్పణ్ణించి యీ లోకం ప్రతిజీవినీ తన వొళ్లోకితీసుకుని సుఖపెట్టాలని చూస్తుంది. దుఃఖాలు బాధలూ వున్నాయే అంటే—అప్పటికూడా యీ సృష్టి సుఖపెట్టాలనే ప్రయత్నం చేస్తున్నట్టూ యీ జీవుల మూర్ఖత్వం వల్లనూ, సృష్టి అసహాయత్వంవల్లనూ, యీ కష్టాలు కలుగుతున్నట్టూ తోస్తుంది. మొత్తానికి యీ లోకంచేసే మహాప్రయత్నమంతా సుఖంకోసమే. సుఖం కోసం వెతకడం జీవులస్వభావంలోనే వుంది; దానికి సృష్టి శతవిధాలా సహాయపడుతోంది. పిల్లకి సదుపాయం చెయ్యడంకోసమై తల్లిహృదయంలో ప్రేమా, స్తనంలో పాలూ, తొడలలో మెత్తదనమూ, ఆపాలలో మాధుర్యమూ, నోటిలో రుచీ, పొట్టలో ఆకలీ, యిన్ని యేర్పరుస్తోంది సృష్టి. ఒక మనుషులకేగాక, మృగాలకి, కీటకాలకి, వృక్షాలకి, గడ్డికికూడా వాటి సుఖజీవనానికై యిన్ని విధాలా సౌకర్యాలేర్పరుస్తోంది. అదిగాక ఒక్కొక్క జ్ఞానేంద్రియాన్నే మేల్కొలిపి రంగులతో, స్వరాలతో, రుచులతో, పరిమళాలతో, మృదు స్పర్శలతో, అభిరుచులతో, కళలతో, ప్రేమతో, సంతోషంతో, భావోద్రేకాలతో ఎట్లాగో ఆనందపెట్టాలని చూస్తోంది. తనని, తన సౌందర్యాన్ని చూసి అనుభవించి సుఖించమని బ్రతిమాలి పిలుస్తున్నట్టు, నిద్రనించి, మత్తునించి లేపి, ఎదురౌతుంది. ఆకలివేస్తే, భోజనమడుగుతాము, దాంటో రుచినికలిపింది. కామం తీర్చుకోవాలని బుద్ధికలిగితే, దాంటో ప్రేమనూ, అందాన్నీ చేర్చింది. ఇంక లక్షరసికతలనూ, ఆకర్షణలనూ మిళితం చేసింది. తోవ కనపడితే చాలుననుకుంటే పక్కనే చెట్లను పువ్వుల్నీ పెట్టింది. గొంతుకలలో మార్దవత్వాలు, రుచులలో పరిమళాలు, ఆకాశంలో నునుపు, గాలిలోమృదుత్వం, వెన్నెలలోని నిర్మలత్వం, నీళ్లలోని చల్లదనం, అన్నీ, నత్తగుల్లల్లో, గడ్డిపువ్వులో కీటకాల నడకలో, పక్షి రెక్కల వొంపుల్లో, వూరికే గుమ్మరిస్తుంది తన ఆకర్షణల్ని యీ జీవులముందు. వీటన్నిటిలోను మిళితమై బాధలూ వున్నాయి. కాని ప్రయత్నమంతా ఆ బాధల్ని తొలిగించడానికిలాగు తోస్తుంది గాని అభివృద్ధి పరచడానికిలాగు తోచదు. రోగాన్ని సృష్టే నాశనం చెయ్యాలని చూస్తుంది. మనశరీరమే తిరగబడి దహిస్తుంది. కష్టాలను మనమనసే హరించి సంతోషపడాలని ప్రయత్నిస్తుంది. అందవికారాన్ని, కుళ్లుని, అపాయాన్ని సృష్టే నాశనం చేసుకుంటో వుంటుంది. ఈ సుఖ దుఃఖ విరోధ భావాల్ని కనిపెట్టే మతకర్తలు, దేవుడూ, సైతాను, బ్రహ్మ,కర్మా, దేవతలూ, రాక్షసులూ కారణాలుగా కల్పించుకున్నారు. ఏమాత్రం కళ్లు కలవాడికైనా, యీప్రపంచం సౌందర్యమయంగా కనపడక మానదు. కనక యీ జీవులు ఎన్ని విధాల, ఎంతగా, సుఖాల్ని అనుభవించి సంతోషిస్తే, అంత సృష్టిప్రుద్దేశ్యం నెరవేరుతుంది.

ముఖ్యంగా శంకరాచార్యులనాటినించి ఒక వేదాంతం బైలుదేరింది. ఇట్లాంటి వేదాంతం ప్రతి మతంలోనూ వుంది. ముఖ్యంగా క్రిస్టియన్లమతంలోదేకాని మతానికి ప్రాముఖ్యతయివ్వరు గనక క్రిస్టియనుదేశాల్ని యీ నమ్మకం బాధించలేదు. మతం తాగి మతాన్నిపీల్చే యీ దేశంలో అది ఎముకల్లో, నరాల్లో ప్రవేశించి, పౌరుషాన్నీ, అభివృద్ధినీ, ఆనందాన్ని నాశనంచేసింది. అదేమిటంటే సుఖ మనుభవించడం పాతకమని, సుఖం క్షుద్రం, అశాశ్వతం, అనవసరం, ముక్తికీ భక్తికీ విరోధం అనీ. మొదట అశాశ్వతమనే అభిప్రాయాన్ని తీసుకుందాము. అశాశ్వతం గనకనే యవ్వనము, జీవనమూ వున్నప్పుడే సుఖాల్ని అనుభవించాలి. అనటోల్ ఫ్రాన్సు ఒకకథ వ్రాశాడు యీ విషయమై. అనగనగా ఒకపతివ్రతవుంది. ఆమెని ఒకాయన కామించి ప్రార్థిస్తున్నాడుగాని ఆమె అంగీకరించలేదు పాపమనేఅభిప్రాయంతో. పతివ్రతేగాని,ఆమెకి చీరలన్నా సోకులన్నా చాలాయిష్టం. అది ఆమె మతాచార్యులకి కంటకంగావుంది. సోకులు మాన్పించాలని చాలాప్రయత్నించాడుగాని సాగలేదు. ఒకసారి ఆయన యాత్రపోతోవుంటే ఆమె 'నాకేంతీసుకొస్తారండీ?' అంది నవ్వుతో. ఆయన "నామనసునచ్చింది తీసుకొస్తానని" చెప్పి ఆలోచించి, మనిషితలకాయను, చర్మమూ మాంసమూ పోయినదాన్ని భయంకరమైనదాన్ని ఆమెకి కానుకగా తెచ్చియిచ్చి, "అందమైనదానవని కులుకుతున్నావు. చివరికి యిట్లా మారబోతున్నావు. రోజూ దీన్నిచూసి జ్ఞాపకంతెచ్చుకుని. సోకులు మానివెయ్యమ'ని చెప్పాడు. ఆమె ఆలోచించి, వెంటనే తనప్రియుడికి కబురు పంపి, అతడు కనపడగానే అతని ఆలింగనంలో వాలింది. అతను ఆశ్చర్యపోయినాడు.

"ఇదివరకు జీవితంసంగతి నాకు తెలీదు. కాలం వృధాచేశాను పాపిని. మూర్ఖురాల్ని,మీఆచార్లు యివాళే నాకు తెలియచెప్పారు. నేనుత్వరలో ఆవిధంగా మారబోతున్నానుట. ఇంక కొద్దికాలమేవుంది ఆనందాన్ని అనుభవించడానికి. కనక నన్నుప్రేమలో ముంచమందిట".

అశాశ్వతమనే వేదాంతం ఫలితమదీ. క్షణ భంగురాలు గనకనే వాటిని అనుభవించకండా వొదలకూడదు.

వైరాగమ్మూ, శమమూ, దమమూ, నియమము నిగ్రహమూ, ఇవన్నీ వుత్తమ గుణాలు అంటారు. భోగాలనుభవించే యోగినిచూస్తే ప్రపంచానికి అనుమానమే— జనకుడిఉదహారణవున్నాకానీ, ఈ ఆనందాలన్నీ యేమిటి యెందుకు ప్రపంచంలో? అని ప్రశ్నిస్తే, యివన్నీ మనిషినితరించడానికి, ముక్తికి అర్హులెవరో తెలుసుకోడానికి దేవుడుపెట్టాడుఅంటారు. అర్హులెవరో తెలుసుకోవాలంటే దేవుడు తెలుసుకోలేడో, యీ test లు లేకండానే. ఈఆనందాల్ని శత్రువులుగా చూసివొదిలెయ్యాలి నీటినీ, చిన్నబిడ్డ చిరునవ్వునీ, వెన్నెలనీ, గడ్డిలో రంగుల్నీ, చెట్ల నీడల్నీ సంగీతాన్ని అన్నిటినీ ఆనందం కలుగుతున్నట్లు తోచిందా పరిగెత్తాలి. గాలి చల్లగావుంటే గదిలోకి పోవాలి. పిట్ట కూస్తే దాన్ని తరమాలి. పాలల్లో వేపాకురసం కలుపుకుని తాగాలి. తల్లిప్రేమా పాలూ, భక్తుల సేవా, యీశ్వర భక్తీ అన్నీ వర్జించాలి. అప్పుడు దేవుడు ముక్తి నిస్తాడు, సంతోషించి. వీపున దెబ్బలు కొట్టుకుని, నాలికలు కోసుకుని, మేకులమీద పడుకునే వారు ముక్తికి అర్హులు. మళ్లీ ముక్తి ఏమిటని అడిగితే, స్వర్గమేమిటంటే ఆనందమే నంటారు. ఈశ్వరుడే ఆనంద మయుడుట. కాని యీలోకంలో ఆనందాలు పనికిరావుట. పురాణాలు తియ్యండి. అన్నిఆనందాల్నీ భార్య ప్రేమని, పిల్లలమీది దయని, మృగాలమీది, చెట్లమీది అనురాగాన్ని కూడా యెట్లాఖండించారో! అదంతా నమ్ముతున్నారా అంటే, ప్రస్తుతం నమ్మకపోవొచ్చు, కాని ఆ అభిప్రాయాలే ప్రజల మాటల్ని, పనుల్ని, యీ రోజున అనేకవిధాల పాలిస్తున్నాయి. క్రమంగా మనుష్యత్వాన్ని, ఉత్సాహాన్నినిర్మూలించి సంఘాన్ని యీగతికి తీసుకొచ్చాయి.

ఈనాడు సుఖంగా భోజనంచెయ్యకండా ఆకుల్నీ, పులవల్నీ తినేవారున్నారు. భార్యల్ని వొదిలే వారు

వారితో సుఖించినప్పుడల్లా, తప్పుచేశామని యేడ్చే వారున్నారు. పిల్లలవల్ల తమ ఆధ్యాత్మికదశలన్నీ నాశన మైనాయని తిట్టుకునేవాళ్లున్నారు. పిల్లలు కనడానికితప్ప ఆనందంకోసం సంగమం పాతకమని బోధించే గురువులున్నారు. కడుపునొప్పివొస్తే అనుభవించాలిగాని మందు తీసుకోకూడదనేవారు, గుడ్డితనం పూర్వజన్మకర్మవల్ల కలిగింది గనక, గుడ్డివాళ్లకి సహాయంచెయ్యడం తప్పని వాదించే వాళ్లున్నారు. నేనెరుగుదును. షోకులుతప్పని, బిగ్గరిగానవ్వడం దురాచారమని, జుట్టు గొరిగించుకోడం పుణ్యమని, బోధించేవాళ్లెందరులేరు? భోగలాలసుడైన వాణ్ణి తృణీకరించరా?

ఈ ఆనందాలు వర్జించడంవల్ల తప్పకుండా ముక్తి దొరుకుతుందనే నిశ్చయమేవుంటే ప్రతివాడూవర్జిస్తాడు. అది ప్రతివాడికీసంశయమే, ఎన్నిశాస్త్రాలు ఎంత బోధించనీ పైగా ముక్తిఅంటే యేమిటో తెలియాలి. అదేమన్నా సౌఖ్యమో లేక బాధో! ఒక్కొక్కప్పుడు యీ వేదాంతులు ముక్తినివర్ణిస్తోవుంటే, పొరబాటునముక్తిలో పడంకద! అదిభయంపుడుతుంది. పగలు వేదాంతుల్ని విని, రాత్రులు పడుకుంటే చిన్నప్పుడు, ఆపరబ్రహ్మంలో లయాన్ని తలుచుకుని గడగడ వొణికేవాణ్ణి. స్వర్గం కూడా అంతే. ప్రస్తుతవ్యవహారాన్నిబట్టి చూస్తే, బూడిద బైరాగులూ, ముసలి వితంతువులూ, కంపుకొట్టే భక్తులూ, ఎన్నడూ నవ్వని ఏడుపుగొట్టు నీతిపరులూ—వీళ్లే స్వర్గానికి వెళ్లేటున్నారు. ఏ పొరబాటునన్నా స్వర్గవాసం ఒకవేళ లభిస్తేమాత్రం, వీళ్లమధ్యకూచోడం ఎట్లా వుంటుంది? అక్కడమాత్రం వీళ్లు ఇట్లానేవుండరా? అక్కడ యీశ్వరుడి సమక్షంలో మరీ నటిస్తారు. ఇక్కడే వీళ్ల భజనలు వింటే యిల్లు వీకి పారిపోవాలనివుంటుందే, అక్కడెట్లానో!

వేదాంతులలో కొందరు లౌకికులేమంటారంటే, "మాకు ఆనందాలమీద కోపంకాదు, తుచ్ఛఆనందాలమీద కోపమం"టారు. తుచ్ఛ ఆనందాలేమిటి? ఇతరులకిగాని ఆ మనిషికిగాని హానిచేసేవి అనుకుందాము. అవి ఎవరూ మంచివనటంలేదు. ఒకడికి ఎంతతిన్నా జబ్బు చెయ్యదు. తింటేనేం? పదిమంది స్త్రీలున్నా సమరించుకోగలడు. వుంటేనేం? తోటలూ, మోటార్లూ, మేడలూ, వీటిల్లో తప్పేముంది? తాగితేనేం, జూదమాడితేనేం? ఎవరికేం అపాయంచేశాయి? అసలు తుచ్ఛ ఆనందాలనేవి లేవు. వేదాంతం ఆనందానికి విరోధి.

కొందరు ఆనందంమీద ఆసక్తి పనికిరాదంటారు. అంటే చల్లనిగాలివొస్తే అనుభవించవొచ్చు గాలికోసం వూరిబైటికి పోకూడదు. గదిలో వుక్కగావుంటే మంచం బైటవేసుకు పడుకోకూడదు. కావలిసి వెన్నెలవంకచూడకూడదు. సినీమాకి పాటకచ్చేరికి వెళ్లకూడదు. ఆనందంకోసం ప్రయత్నంకూడదు. అంతేకాదు కోర్కెలే వుండకూడదుట. చెడుగుకేకాదు,మంచికికూడా. కోర్కెలేకండా వుండడం జీవితానికి విరుద్ధం. తిందామనేకోర్కెలేంది తినడమెట్లా? నడవాలనే కోర్కెలేంది నడవడమెట్లా? తెల్లవారిపక్కమీద కళ్లుతెరుస్తాడు. లేవకూడదు. ఎందుకూ? లేచేర్కి వుండకూడదు. అంతే అక్కడే చస్తాడు.

మంచిపనులు చెయ్యాలనీ వుండకూడదుట. ప్రేమకూడా బంధంట. సత్యాన్నీ, అందాన్నీ, ప్రేమించడం కూడా అపరాధమే. ఎవడన్నా చస్తున్నా చెయ్యిసహాయంయివ్వకూడదు. కరుణకలిగితే అదిమళ్లీబంధం. చెయ్యియివ్వాలని బుద్ధిపుడితే కోర్కె. ఏదో ఆ మరణబాధ మాయ. పూర్వజన్మకృతం. అనుభవించనీ' అని తన తోవనతాను పోవాలి. ఒకవేళ సహాయంచేశినా, వాడు కృతజ్ఞత చూపాడా, వాడికృతజ్ఞతవల్ల ఆనందంకలిగిందా వొదిలిపరిగెత్తాలి. ఇట్లాంటి వేదాంతాన్ని వింటూరు లొట్టవేసుకుంటో యీపండితులు.

ఎందుకు కోర్కె ఆసక్తి వుండకూడదు? అంటే ముక్తిదొరకదు అంటారు. ప్రతివాడూ ఆధ్యాత్మికమార్గాన ముక్తికి పోవాలి. ఎట్లా? తానేయీసృష్టి అంతానని తెలుసుకొని. మరిసృష్టితో సృష్టిసుఖదుఃఖా-

లతో ఐక్యంకాంది సృష్టిలో కలిసివున్న బ్రహ్మంతో ఎట్లా ఐక్యమౌతాడు ?

ఒక గొప్ప పొరబాటేమిటంటే—అందరికీ ఆధ్యాత్మికం చాతనవుతుందనుకోడం. మనిషి చేసింది యింకోమనిషి చెయ్యగలడనే పూర్వవాదం ఎప్పుడో యెగిరి పోయింది. ఎంతప్రయత్నిస్తే మాత్రం, కాళిదాసూ, నెపోలియన్, శాండో, బోస్, కాగలరా ప్రతిమనిషి. కొండజాతివాణ్ణి తీసుకొచ్చి రవీంద్రనాద్ గా మార్చమనండి. అట్లానే ప్రతిమనిషీ రుషికూడా కాలేడు. అట్లాంటి వెర్రిప్రయత్నాలతోనే యీనవీన వేదాంతులు, దొంగ రుషులుగా తయారుకావడం, ఈలోకానికీ ఆలోకానికీ చెడడం.

“నేను నాభార్యతో సంబంధం మానుకున్నాను. అందరూ మానుకోండి” అన్నారు ఒకరు.

“నేను ఒక్క-రాత్రే యిరవై స్త్రీలను సంతుష్టి పరిచాను. మీరూ పరచండి’ అంటాడు యింకోడు.

తారతమ్యం యేముంది ? అది యెంతశక్తో యిదీ అంతే. కొందరి కొందరికి కొన్ని విధాలైన శక్తులున్నాయి. అవి అందరికీరావు-ఎంత ప్రయత్నించనీ మొదటివారి శక్తిని రెండోవారు సంపాయించగలిగినా, రెండోవారి శక్తిని మొదటివారు సంపాయించగలరా ?

ఆధ్యాత్మికానికికూడా కొందరే తగివున్నారు. తక్కినవారిది ప్రయత్నంమాత్రమే. మరి ఆ ఆనందం యెన్నికోట్ల జన్మాలవరకో దొరకదంటారు కదా, అంత వరకూ యీ ఆనందాలన్నిటినీ వొదులుకుని, ఏసౌఖ్యమూ లేకండా, నవ్వులన్నా పువ్వులన్నా హడిలి పరిగెత్తుతో వుండవలిసిందేనా ? పాడుమొహం వేసుకొని తిరగవలిసిందేనా ? గుర్రాలనే, యీ పంచేంద్రియాలు సౌఖ్యాల వైపు యీడుస్తోవుంటే, వైరాగ్యమనే కళ్లెంతో వాడిని బిగపట్టి, బిగబట్టి శ్రమపడుతో గడపవలిసిందే అంత కాలాన్నీ ! ఆధ్యాత్మికానందం వర్ణనాతీతమంటారే, అదేదొరికితే యీ పిచ్చిఆనందాలు వొదులుకోమని వేరేబోధించాలా ! అది దొరకనంతవరకు వొదులుకుంటారా ? దొంగతనం, నటనా, మోసమూ, బలహీనం, నిస్పృహా తప్ప ! ఐనా ఆధ్యాత్మికానందానికీ తక్కిన సౌఖ్యాలకీ యీ విరోధమెందుకు ? అన్నీ అనుభవించ కూడదూ ? సినిమాచూసీ ఆనందంపొందితే జామపండు తినేఆనందంకూడా వుండకూడదా ? ఈశ్వరుడితోడి ఆనందానికి మల్లెపూలవాసనలు అడ్డుతగలవుగదా ? స్త్రీల మీది ప్రేమమాత్రం ఎందుకు అడ్డురావాలి? భార్యమీది కాపీనం, తనకోసంభద్రంగా ఒకస్త్రీని వుంచేసి పెట్టుకోడమూ, అనుమానాలు పడడమూ, యివన్నీ ఆధ్యాత్మికానికి అడ్డుతగలమట. కాని జీవితాన్నంతా అపభ్రంశం చేసి చికాకు పెట్టే భార్యని వొదిలి, ఆనందం యివ్వగల ప్రియురాల్ని వాంఛించడం ఆధ్యాత్మికానికి విరోధం. మొత్తానికి ఆనందానికే, ఆనందమయుడైన యీశ్వరుడి సన్నిధానానికే విరోధమంటున్నారు.

ఆనందమే అపాయకరమని నమ్మడంవల్లనే యిట్లా మారారు. ఇప్పటికీ కళ్లుతెరవరు. ప్రయత్నమంతా, మనిషి అన్నంతో, కాపీతో, యెట్లా బతకగలడో కని పెట్టాలనేగాని, ప్రతిమనిషికీ రోజుకు రూపాయవొచ్చేట్లు చెయ్యాలనికాదు. మనుష్య స్వభావంలో నమ్మకంలేదు. ఎనిమిది గంటల కాలమన్నా పనిచేసి తీరాలిట: ఎందుకు ఆనందం తగ్గాలి. విశ్రాంతివుంటే కొంటెతనం హెచ్చుతుంది. రుచులు తగ్గించాలి. ఇవన్నీ పాలించి, ఆరోగ్యాన్ని హెచ్చుచేస్తారుట ! ఎందుకా ఆరోగ్యం ? ఏంచేసుకోను ?

స్త్రీపురుష సంబంధంకూడా సంతానంకోసం. సంతోషానికికాదు. సంతానంకోసంకన్నా సంతోషం తప్పదు. సంతోషంతీసేందుకు ఎదన్నా పద్ధతి కనిపెట్టిన వాళ్లకి All India Prize ఎదన్నా ఏర్పరచకూడదూ ? సంతాన భయంలేనివాళ్లు సుఖమనుభవించవొచ్చు, ముఖ్యం భాగ్యవంతులు. ఎందుకు సంబంధం కూడదు ? స్నేహంగొప్పది. అవునేమో ! కాని శరీరానందానికీ,

మానసికానందానికీ ఆ విరోధ మెందుకో. శరీరసంబంధం మానితే మానసికానందం యెక్కువయిందన్నారు. కారణం తోచదు, ఏదో వ్యాధితప్ప. అసలు యీసంసారాల్లోని విరోధాలూ, వ్యభిచారాలూ, చిరాకులూ, హిస్టిరియాలూ, అన్నీ శరీరవాంఛ తీరకనే కాదూ? మనసంతా దేశ సేవతో నిమగ్నమై, పరోపకారచింతతో పర బాధలకోసమై దహించుకుపోయే వారు కామేచ్ఛను మరిచిపోగలిగారని ఆ మంత్రమే ప్రజా సామాన్యానికి ఆదర్శంగా చూపడం ఎంత న్యాయంగా వుంది! ఆ అదర్శంవల్ల వొచ్చేఫలితమేమిటి? కామ జ్వరాలూ మదపిచ్చీ, కుటుంబ వ్యసనాలూతప్ప! భార్యకీ భర్తకీ స్నేహం యెక్కువకాదు సరేకదా, ఒకరిని ఒకరు సమీపించడానికి భయపడి, సంతానభయమనే పెను భూతం వెంటనంటి, ఆత్మహత్యలుచేసుకుంటారు. యిట్లాంటి తెలివిని లేని బోధనల్ని తెలివిలేకుండా అనుకరించబోయి అట్లానే ప్రజలందరికీ విరోధుల్నికూడా ప్రేమించగల హృదయపరిపాకం కలుగుతుందని నమ్మేగా, అసలు కార్యం పాడుచేసుకున్నది! మనుష్యుల అలవాట్లు, ఆచారాలుమార్చడం సులభం, స్వభావాల్ని యుగాలు మార్చ వలిసిందే!

ఈ వైరాగ్యబోధన, దొంగలకి మంచిసాధన మయింది. చాలాసులభంగా దేశగౌరవాన్ని పొందవొచ్చు. శనగలుతినేవాళ్లూ, గోచీలు పెట్టుకునేవారూ గుళ్లు చేయించుకున్నవాళ్లూ అమాంతంగౌరవంలో హెచ్చిపోతారు. ఎంతసేపటికీ తిండిమాను, కాఫీహోటలుమాను, సినీమామాను, సిగరెట్లుమాను, తాగుడుమాను, స్త్రీ మోహంమాను అనిబోధనలు. అసలుసంగతి యీ బోధనలవల్ల వొకడూమానడు. ఎందుకు బోధిస్తారంటే; బోధకులు బాగుపడడానికి. కాని వీళ్లుచేసే దుర్మార్గమేమిటంటే మూర్ఖులైన యీ అలవాట్లు వున్నవాళ్ల సుఖాన్ని చెరుపుతారు, సందేహాలు రేపుతారు, సిగ్గుపడేట్టు చేస్తారు. అనుభవించే ఆనందంలో ఆరోగ్యాన్ని నాశనంచేస్తారు.

వైరాగ్యంలో ఏమివిశేషంగాని శ్రేష్ఠత్వంగాని లేదు తుచ్ఛసుఖాలమీదివైరాగ్యం, వున్నత సుఖాలమీదిప్రేమ అనే అర్థమివ్వాలి. ఇతరుల్ని కష్టాలుపెడితే వొచ్చే ఆనందం, యితరుల సుఖాలవల్ల కలిగే ఆనందంగా మారాలి. నిద్రసుఖంవర్జిస్తే, వుషాశోభనుచూసే అతీత ఆనందం రావాలి. ఆ ఆనందంలేక కునికిపాట్లు పడేవాడు నిద్ర నెందుకు చెరుపుకోవాలి?

వొప్పుకోరుగాని, ఇదంతా పూర్వవేదాంత ఫలితం. ఆశని, ambition న్ని, వుత్సాహాన్ని, యత్నంలో నమ్మకాన్ని, అనుభవించే ధైర్యాన్ని చంపింది యీ నిష్కర్మ వేదాంతం. సుందర మైన యీప్రపంచాన్ని, మాయ, దుఃఖసాగరం, ఎంతతొరగా వొదిలితే అంత మంచి దన్నారు. ఇట్లాంటి బోధనబురదలో బతకలేక బతకలేక, తలలెత్తుతున్నాయి ప్రజలకోర్కెలు. ఇవన్నీ నమ్మడం వల్ల, కష్టాలను ప్రేమించారు ప్రజలు. ఎదురుతిరిగి పోరాడి జయించే శక్తి చచ్చింది. యిరవైయేళ్లకే మన ఖర్మమింతేనని ఆశలుగిడి, జీవచ్ఛవాలై బతుకుతున్నారు. అవ్వా, ఆదమూ చేసినపాపంలో పుట్టామని క్రిస్టియనులూ మహమ్మదీయలూ నమ్మి, ప్రతిమనిషీ పాప బుద్ధికలిగినవాడేనన్నారు. ఆవేదాంతం కొన్ని వందల యేళ్లుపీడించి దేశాల్ని అణిచిపట్టింది. మతంలోనమ్మకం వొదిలిందాకా సైన్సు కాంతినిచ్చిందాకా అభివృద్ధిలోకి రాలేకువారు. మనషులే నీచులనీ, పాపాత్ములనీ నమ్మకాలు వొదల్లేదు నీతిపరులలో యింకా. సహజంగా పాపులు గనక, సహజవాంఛలన్నీ పాపాలే. ఆకలీ, కామము, ప్రేమా, సౌందర్యపిపాసా, అన్నీ పాపాలే.

దేనికోసం యీ నిగ్రహం? కామ వాంఛల్ని అడ్డగొడితే ఏంలాభం? జీవితమే వాంఛలలో మిళితమై వుందే, వాంఛలేనిదే జీవిత వికాసమే లేదే? వాంఛలు లేనివాడు యీశ్వరుడికి ప్రియుడా? వాంఛవల్లనే కదా యీశ్వరుడు సృష్టి ప్రారంభించింది?

అజీర్ణకుడికీ, నపుంసకుడికీ అంధుడికీ, జడుడుకీ

స్వర్గద్వారాలు తెరుస్తారా? ఈ ప్రపంచ సౌఖ్యాలన్నీ మనుషుల్ని అంధకారంలోకి లాగడానికి కల్పించిన పైశాచికమాయలా? శరీరానందాలు వొదులుకుంటే, ఆత్మానందం కలుగుతుందిట! ఇదీకలగదు, అదీకలగలదు. సంగీతం వింటోవుంటే భోజనం మరిచిపోవొచ్చుగాని, భోజనంమానితే సంగీతం వినపడుతుందా?

అసలు యీలోకం మాయఅనీ, సౌఖ్యాలూ కోర్కెలు పనికిరావనీ, విషయరాహిత్యం కావాలనీ, లోకం దుఃఖసాగరమనీ, యీవేదాంతాన్ని తెచ్చిపెట్టింది శంకరాచార్యులు. ఇది వేదమతంకానేకాదు. హిందూదేశ ఔన్నత్యం క్షీణించి, సత్తువలు వుడిగినతరువాత పుట్టిన కుక్కమూతి వేదాంతం. బౌద్ధమతాన్ని జయించలేక, దాంట్లోభావాల్నే తీసుకుని, మతప్రతిష్ట నిలబెట్టుకోవాలని చేసినమహాప్రయత్నమిది. బౌద్ధులతో వాదించివాదించి, యీశ్వరుణ్ణి కర్మకు కట్టుబడిచేసి అస్వతంత్రుడూ, శక్తిహీనుడూ, రసహీనుడూ, ఐన నిర్జీవ అంధశక్తిగా చిత్రించుకున్నాడు శంకరాచార్యులు. వేదకాలంలో విశ్వాసమే వేరు. ఈలోకాన్ని త్యజించాలనే వేదాంతమే లేదు. ఇదంతా బౌద్ధభిక్షుకులనించి పుట్టింది. ఆర్యులభోగలాలసత్వానికీ, కర్మకలాపాలకీ యెదురుతిరిగిన బౌద్ధమతసాంప్రదాయం.

ఈవిషయమై చాలాకృషిచేసిన అనంతాచార్యులగారి 'Visicn of Aryan Glory' అనే పుస్తకం లోంచి వుదహారణ లిస్తున్నాను.

"బౌద్ధమతంతరవాత పునరుద్ధరింపబడిన హిందూమతానికి, బౌద్ధమతపు క్షణికవాదాన్ని జయించడానికనే ప్రయత్నంలో యీ ప్రపంచమే అసత్యమని, జీవితమే మాయఅనీ, నిర్గుణుడు, నిరామయుడైన ఆత్మ పరమాత్మ వొకటేశాశ్వతునీ,చెప్పుకోవలిసినవీ అగత్యంకలిగింది.అనేక రూపాలతో ప్రసన్నమైన యీలోకాన్నీ, దానిలోని మనుష్యజీవితాన్నీ సమన్వయం చెయ్యడంమాని, ఆసమస్యను సాధించేయత్నంలో, ఆసమస్యను అట్లాగే వొదిలి, దానితో జోక్యంలేదని తప్పించుకుని, విరక్తిమార్గంలో పడ్డది. బౌద్ధమతం తరవాత ప్రతిష్ఠింపబడిన హిందూవేదాంతాన్ని ఆర్యవేదాంతమనడానికి వీల్లేదు.

ఆర్యమతము, ఏమన్నదంటే——
సర్వంఖల్విదంబ్రహ్మ.
యద్భూతం యత్ చభవ్యం.
యదన్నేన తిరోహతి
యాతీవాన్ అస్యమహిమా

ప్రపంచంలోని ప్రతిదీ పరబ్రహ్మనించి వొచ్చిందని స్పష్టంగాచెప్పి యీప్రపంచాన్ని అసత్యమనడం అసురమనీ నిరీశ్వరమనీ అన్నారు.

అసత్యం అప్రతిష్టం.
దె జగదాహుర్ అనీశ్వరమ్.

ఈప్రపంచంలో కనపడేకష్టాలనూ, జీవితంలో తోచే అనిత్యతనూ చూసి జంకి, నిష్కామ నిష్కర్మతత్వంతో శూన్యాన్ని శరణుజొచ్చడం, అనార్యశక్తిహీనత్వం.

క్లైబ్యం అనార్యజుష్టమ్.

ఆర్యులకు సహజమైన కర్మ, యజ్ఞ సాహస, విశ్వాసాలు లేవు యీమతంలో. ఈనాడుకూడా పాశ్చాత్య విద్యాంసులు హిందువుల్ని ఆధ్యాత్మిక వేదాంతజ్ఞానంలో గొప్పవారనిపొగిడి బుజ్జగించి జోలపాడుతున్నారు. అంటే అర్థమేమిటంటే, హిందువులు శక్తిహీనులైన సోమరి వేదాంతులనిన్నీ, ప్రపంచలో ప్రాక్టికల్‌గా, భౌతిక కార్యాచరణకు పనికిరానివారనిన్నీ, ఇహలోక సంపదలకొరకై పశ్చిమదేశవాసులకరుణమీద ఆధార పడవలసిన వారనిన్నీ, వారి లోక విజ్ఞాన శాస్త్రాలమీద ఎప్పుడూ ఆధారపడవలసిన వారేననీ వుద్దేశ్యం. ఆర్యులు వేదాంత మాయా ప్రపంచంలో చిక్కుకుని, యీ ప్రపంచ క్షేమాన్ని యెన్నడూ మరవలేదు. "ఈ మాయావాదాన్ని తప్పించుకుని మనం నిజకాంతితో ఆర్యుల చరిత్రను తెలుసుకునే సామర్థ్యమే

మనకు కలిగితే, వారి నిర్మల, స్పష్ట వాఙ్మయాన్ని సరిగా పరీక్షించ గలిగిన శక్తి మనకు లభిస్తే, వారు భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక లోకాలలో దేనినీ నిర్లక్ష్యపెట్టక, సమంగా కృషిసల్పి, సంపాయించిన, ఐశ్వర్యాన్ని, తేజాన్ని, మహిమను, వారి ఆత్మ వికాసం చేత, కర్మ సాఫల్యంగా పొందిన శాంతిని, మనం చూడగలం. వారు సేకరించిన ఆయుర్వేదం మొదలైన శాస్త్రాలను, కళలనూ, సామాన్య పామరుల కోసమనిన్నీ, ఆధ్యాత్మికులకు అవి అనవసరమనిన్నీ తలుస్తున్నారు యీ నాటి ప్రజలు.

ఆర్యుల విజ్ఞానమంతా వేదాలలో ప్రతిఫలింపచేశారు. కళలు, ఖగోళశాస్త్రం, గణితం, వ్యాకరణం, ఆయుర్వేదం, అస్త్రశాస్త్రం, రాజ్యశాస్త్రం మొదలైన భౌతిక విజ్ఞానాలన్ని, వేదాంగాలలో ఉపాంగాలలో యిమిడ్చారు. జీవితాన్ని చూసి జంకక, మాయ అని తప్పించుకోక, ప్రయత్నించి, సాధించి, సంపూర్ణంగా అవయవాలతో, మనస్సుతో, ఆత్మతో అనుభవించి సంపూర్ణమైన జీవితాన్ని అన్ని విధాలా వృద్ధిచేసుకోగలిగారు. పురాతన వచనాలనూ, నశింపుసకు వొచ్చిన కుళ్లు ఆచారాలనూ పట్టుకుని పాకులాడక, ఎప్పటికప్పుడు స్వంతంగా ఒరిజినల్‌గా రూఢి పరుచుకున్న వాస్తవ జీవితాల్ని జీవించారు. భాషను, భావాలను, ఆచారాలను, చిలకలవలె అనుకరించి బతికే మనము, జైమినీ, వ్యాసుడూ వేదాలు అపౌరుషేయాలనే చెప్పిన సాహసాన్ని దూరాన్నించైనా అర్థంచేసుకోలేము కదా!

*

ఈశ్వరుడు తన లీలగా సృష్టించుకొన్న జీవితం దుఃఖసాగరం మెట్లా అవుతుంది? సత్యమైనవాడు యీరూపాన్ని ధరించినప్పుడు యిదంతా అసత్యమూ మాయా యెట్లా అయింది?

ఆనందమయుడైన యీశ్వరజనితులైనవారు ఎవరి తాహతునిబట్టి వారు ఎంతవరకు అందుకోగలిగితే అంత వరకు అనుభవించడానికి, నూతన సుఖమార్గాలను కనిపెట్టడానికి, జన్మహక్కు లేదా? జీవితాన్నీ సంఘాన్నీ నిర్జీవంగా చేసుకుని, కాలతోసే బలువుల్ని విదుల్చుకునే ధైర్యంలేక సంసారాల్ని దుఃఖసాగరాలు చేతులారా చేసుకుంటూ, పై యీలోకం మాయ అనీ పాపభూయిష్టమనీ, రుజువుచెయ్యడానికి ఎక్కడ పాపం కనపడుతుందా అని అందరి జీవితాల్లోనూ నలుసులేరుతూ-ఎదో దేవుడు బలవంతంగా బతికిస్తున్నాడు గాని, లేకపోతే చచ్చిపోవడమే నయమన్నట్టు. బతక్కపోతేనేం? చావరాదూ?


## హస్తరేఖా శాస్త్రము



విశదముగా తెలియగల 800 చిత్రములతోగూడి స్త్రీ, బాలురు సైతము చదువుట కనుకూలించు తేట తెల్లంబగు నాంధ్ర వచనరూపమగు నీగ్రంథముచేత ఆయువు, వివాహలాభము, గుణము, శక్తి, బుద్ధి అదృష్టము, సంతానము, లౌకిక సుఖము వ్యాజ్యము. శక్తి ఐశ్వర్యము, గండము, జయము, వ్యాధి, ఋణము, అపాయము, మోసము, జ్ఞానము, దుఃఖము, కార్యసిద్ధి, దయ, మరణము మొదలగు ననేక విషయములను సులభముగా దెలిసికొనవచ్చును. ఇంకను, విధిప్రేరణము, జీవిత రహస్యములను తెలియజేయుటకై గల్గు సాధనంబు లన్నింటిలోను యిది యగ్రస్థానంబును వహించియున్నది. భూత భవిష్య ద్వర్తమానంబులని చెప్పబడు త్రికాల వృత్తాంతంబులను దెలియుటకు ఈ గ్రంథము కల్పవృక్షము వంటిదని దీని నామూలాగ్రము ఒక్కమారు చదువువారే చెప్ప సాహసింతురనుట కెంతయు సందియంబు లేదు.

దీని వెల 2-0-0.

ఆనందబోధిని ఆఫీసు, సౌకారుపేట మదరాసు.


*Vision of Aryan Glory by Dr. E. Anantacharya, Bapatla.